

తీపి తగ్గ లేదు..

ప్రతికూల పరిస్థితులు ఉన్నా జహీరాబాద్ ప్రాంత రైతులు చెరకు పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. వివరాలు 8లో ▸



దారి చూడు.. దుమ్ము చూడు

సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి హైవే పనుల్లో నిండా నిర్లక్ష్యం కనిపిస్తుంది. దుమ్ము ధూళి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 8లో ▸



సిబ్బంది లేక ఇబ్బంది

పెద్దశంకరంపేట మండలంలో విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

రాష్ట్ర అడిషనల్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి



ఉన్నతి బోధనపై అవగాహన కల్పిస్తున్న సుదర్శన మూర్తి

చిన్నశంకరంపేట(మెదక్): విద్యార్థులకు సులభంగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయుల బోధన చేయాలని విద్యాశాఖ రాష్ట్ర అడిషనల్ మానిటరింగ్ ఆఫీసర్ సుదర్శన మూర్తి అన్నారు. గురువారం చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాలలో ఉన్నతి బోధన కార్యక్రమాన్ని జిల్లా మానిటరింగ్ టీం సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ, విద్యార్థులు చదవడం, రాయడం, ఇంకా అంశాలపై అవగాహనను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు బాధ్యతతో విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఈ సందర్భంగా టీచర్ల బోధనను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీపీడీ సునీత ఖన్నా, ప్రవీణ్, సభ్యులు సమీర్, చంద్రిక, కళ్యాణిరెడ్డి, బక్కప్ప, మహేందర్, జెడ్పీ పాఠశాల హెచ్ఎం దీప్లారాథోడ్ పాల్గొన్నారు.

9 నుంచి సదరం క్యాంపులు

మెదక్ కలెక్టరేట్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 9 నుంచి సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా గురువారం తెలిపారు. ఈ క్యాంపులో అర్హులైన దివ్యాంగులను గుర్తించి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని పేర్కొన్నారు. ఈ క్యాంప్‌లకు సంబంధించి తేదీలను మీసేవా, ఈ సేవా కేంద్రాలకు కేటాయించినట్లు తెలిపారు. దివ్యాంగులు తమ దగ్గరలో ఉన్న పై కేంద్రాల్లో ఆన్‌లైన్లో స్లాటు బుక్ చేసుకోవాలని తెలిపారు.

సెంట్రింగ్ పనికెళ్లి వస్తుండగా..

బైక్‌ను ఢీకొన్న కారు ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు



శేఖర్‌యాదవ్ (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): బైక్‌ను కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి శివ్వంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన ఎంచర్ల శేఖర్‌యాదవ్(35), విజయ్‌కుమార్ నర్సాపూర్‌లో సెంట్రింగ్ పని ముగించుకుని బైక్ పై గ్రామానికి బయలుదేరారు. తూప్రాన్– నర్సాపూర్ హైవే చిన్నగొట్టిముక్ల గ్రామ శివారు వద్దకు రాగానే నర్సాపూర్ వైపునకు వస్తున్న కారు, బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో శేఖర్‌యాదవ్ అక్కడికక్కడే మృతిచెందాడు. విజయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శేఖర్‌యాదవ్ భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

పెళ్లి బృందంపైకి దూసుకెళ్లిన కారు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు
- భూతగాదాలే కారణం
- అప్పగింతల్లో బయటపడిన వైనం



రోదిస్తున్న కుటుంబీకులు, మృతురాలు రమ్య

చేగుంట(తూప్రాన్): అప్పగింతల తంతు పూర్తి చేసి వస్తున్న బంధువులపైకి కారు నడపడంతో ఒకరు మృతిచెందగా, నలుగురు గాయపడిన ఘటన మండలంలోని రెడ్డిపల్లి కాలనీలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపల్లి కాలనీలో ఉప్పు వెంకటేశ్ కూతురు సువర్ణ వివాహం గురువారం జరిగింది. సాయంత్రం అప్పగింతల కార్యక్రమం ముగించి ఇంటికి వస్తున్న సమయంలో ఉప్పు స్వామి, ఉప్పు నరేందర్ మధ్య గొడవ జరిగింది. ఇదికాస్త పెద్దది కాగా నరేందర్ తన కారును.. స్వామితోపాటు బంధువులపైకి పోనిచ్చాడు. ఈ ప్రమాదంలో ఉప్పు రమ్య, ఉప్పు దుర్గయ్య, యాదగిరి, సుజాత, బబ్లూకు గాయాలయ్యాయి. వీరందరినీ నార్సింగిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. తీవ్రంగా గాయపడిన రమ్య, దుర్గయ్యను హైదరాబాద్‌కు మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో రమ్య (22) మృతిచెందింది. గత కొన్ని రోజులుగా స్వామి, నరేందర్ మధ్య భూతగాదాలు ఉన్నాయని, పాత కక్షల నేపథ్యంలోనే దాడి చేసుకున్నారని స్థానికులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా..

ఇంటర్ విద్యలో ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదు. రెండేళ్లుగా రిజల్ట్స్‌ను చూస్తే ఇది స్పష్టమవుతోంది. 2023లో రాష్ట్రంలోనే జిల్లా 33వ స్థానం, 2022లో 31వ స్థానాన్ని పొందింది. ఇప్పుడు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కలెక్టర్ పూర్తి స్థాయిలో కసరత్తు ప్రారంభించారు.



కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

మెదక్: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 16 ఉండగా ప్రైవేట్ కళాశాలలు 47 ఉన్నాయి. కాగా గడిచిన రెండేళ్లుగా ఉత్తీర్ణత శాతం ప్రభుత్వ కాలేజీల్లో అత్యంత దారుణంగా పడిపోయింది. ఈ ఏడాదిలో జరిగే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి సబ్జెక్ట్‌కు నిపుణులతో కూడిన ఐదుగురు అధ్యాపకులను ఎంపిక చేసి వారితో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన బుక్‌లెట్స్‌ను ప్రత్యేకంగా తయారు చేయించారు. ఇప్పటికే నూరుశాతం పాఠ్యాంశ బోధన పూర్తి అయ్యింది. దీంతో ప్రత్యేకంగా తయారు చేసిన బుక్‌లెట్లను ప్రతి కాలేజీకి సబ్జెక్టులవారీగా అందించనున్నారు. వాటిని ప్రైవేట్ కాలేజీలకు సైతం అందించనున్నారు. ఇందుకు సంబంధించి ప్రత్యేకంగా టైంటేబుల్‌ను తయారు చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

9న ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమావేశం..

ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఈనెల 9న, కలెక్టర్ రాజర్షి షా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నారు. గడిచిన రెండేళ్లలో రాష్ట్రంలోనే మెదక్ జిల్లా ఇంటర్ ఫలితాల్లో అత్యంత వెనుకబాటుకు గల కారణాలను తెలుసుకోనున్నారు. కాగా ప్రత్యేకంగా తయారు చేయించిన బుక్‌లెట్స్ గురించి వారికి వివరించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన బోధకులు ప్రత్యేకంగా తయారు చేసిన ప్రశ్నావళిని విద్యార్థులకు బోధించాలని, అలాగే ప్రత్యేకంగా రూపొందించిన టైంటేబుల్‌ను అనుసరించాలని ఆదేశించనున్నారని తెలిసింది. బుక్‌లెట్‌లో ఉన్న పాఠాలు చెబుతూ వెనువెంటనే టెస్టులు నిర్వహించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి స్పెషల్ క్లాసులు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కలెక్టర్ కసరత్తు

- రెండేళ్లలో ఉత్తీర్ణతలో అత్యంత వెనుకబాటు
- నిపుణులతో బుక్ లెట్స్‌లను తయారు చేయించిన కలెక్టర్
- ఈనెల 9న అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం

ప్రత్యేక కార్యాచరణ



జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో వెనుకబడ్డాం. కలెక్టర్ రాజర్షిషా సబ్జెక్టుల వారీగా నిపుణులతో బుక్ లెట్స్‌లను తయారు చేయించారు. ఇప్పటికే సిలబస్ వంద శాతం పూర్తి అయ్యింది. ప్రత్యేకంగా తయారు చేయించిన వాటిని ప్రభుత్వ, ప్రైవేట్ అన్ని కళాశాలల్లో పంపిణీ చేయనున్నాం. ప్రత్యేకంగా రూపొందించిన టైంటేబుల్ ప్రకారం బోధన జరిగేలా చూస్తాం. విద్యార్థులకు ఎప్పటికప్పుడు టెస్టులు పెట్టేందుకు కార్యాచరణ చేపట్టాం.

సత్యనారాయణ, జిల్లా ఇంటర్ విద్యాధికారి

2022-23లో 34 శాతం ఉత్తీర్ణత

- 2021-22లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 2,704 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1,081 మంది ఉత్తీర్ణత సాధించారు. పాస్ కేవలం 40 శాతం మాత్రమే. సెకండియర్‌లో 1,934 మంది పరీక్షలు రాయగా 984 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత 51 శాతంగా ఉంది. దీంతో ఓవరాల్‌గా రాష్ట్ర స్థాయిలో 31వ స్థానంలో నిలిచింది.
- 2022-23లో ఫస్టియర్‌లో 2,065 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 698 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణ శాతం కేవలం 34 శాతంగా ఉంది. సెకండియర్‌లో 1,777 మంది పరీక్షలకు కూర్చోగా 1,009 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత 57 శాతంగా నమోదైంది. రాష్ట్ర స్థాయిలోనే జిల్లా 33వ స్థానంలో నిలిచింది.

“ ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



రెండేళ్ల ఇంటర్ ఫలితాలను గమనిస్తే ఆశాజనకంగా లేవు. ఇందుకు సంబంధించి ఇప్పటికే విద్యా శాఖ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నా. ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించటమే లక్ష్యం. దీంతో నిపుణులతో ప్రత్యేకంగా బుక్‌లెట్స్‌లను తయారు చేయించాం. ఇందులో ఉన్నవి బోధించాల్సి ఉంటుంది. అంతేకాదు ఎప్పటికప్పుడు అధ్యాపకులు విద్యార్థులకు టెస్టులు పెడతారు. ఇలా కష్టిస్తేనే వారు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారు.

– రాజర్షిషా, కలెక్టర్ ”

పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలి

మంత్రికి డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి వినతి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందజేస్తున్న వినోద్, సంతోష్ తదితరులు

మెదక్: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వినోద్ కుమార్, సంతోష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఉన్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేషను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీనిచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న తొలిమెట్టు, ఉన్నతి కార్యక్రమాలను రద్దు చేయాలన్నారు. జీఓ 317 ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయి రిలీవ్ కానీ వారిని తక్షణమే రిలీవ్ చేయాలన్నారు. పదోన్నతుల్లో టెట్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. లేదంటే ఆరేళ్లలో పాసయ్యేలా అవకాశం ఇవ్వాలన్నారు.

మున్సిపల్ చైర్మన్ రాజీనామా

- ప్రజలకు రుణపడి ఉంటా: మురళీయాదవ్
- బీఆర్ఎస్ పాలనలో అన్నీ వైఫల్యాలేనని విమర్శ



మాట్లాడుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ ప్రకటించారు. గురువారం ఆయన రాజీనామా పత్రాన్ని కమిషనర్‌కు పంపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొన్ని రోజులుగా బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు తనపై అవిశ్వాసం పెట్టేందుకు కలెక్టర్‌కు లేఖ అందజేశారని తెలిపారు. అయితే.. ఇంకా నోటీసు అందకపోయినా స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిలర్ పదవికి కూడా రాజీనామా చేయాలా వద్దా అనే విషయం పార్టీ కౌన్సిలర్లతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వైఫల్యాలేనని విమర్శించారు. ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేసినా నిధులు విడుదల చేయలేదని, దీంతో అభివృద్ధి కుంటుపడిందని మండిపడ్డారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నర్సాపూర్ వచ్చినప్పుడు నిధుల కోసం ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. అవి ఇంతవరకు విడుదల కాలేదని, పైగా చేసిన పనులకు నిధులు అందక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాగా, తనను అనేక మార్లు గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని మురళీయాదవ్ చెప్పారు. సమావేశంలో బీజేపీ కౌన్సిలర్లు సురేష్, రాజేందర్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

త్వరలో అర్హులకు రేషన్ కార్డులు

- దరఖాస్తుల స్వీకరణకు మరో రెండు రోజులే అవకాశం
- కలెక్టర్ రాజర్షిషా స్పష్టీకరణ



కలెక్టర్‌తో మాట్లాడుతున్న పాలంపల్లి గ్రామ యువకుడు

చేగుంట(తూప్రాన్): మరో రెండు రోజులే ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణకు అవకాశం ఉందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని పొలంపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తులు సమర్పిస్తున్నారన్నారు. ఇతర సమస్యలకు సంబంధించిన అర్హత కలిగినవారు తెల్ల కాగితంపై రాసి అదనపు కౌంటర్‌లో అందించాలని తెలిపారు. త్వరలోనే రేషన్ కార్డులు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు తీసుకోవడానికి శనివారం వరకు గడువు ఉందని చెప్పారు. దరఖాస్తుదారులు తమ అర్జీలను సకాలంలో అందించాలని కోరారు. తొలుత పొలంపల్లి గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల సత్యం, మండల ప్రత్యేక అధికారి జమ్లానాయక్, తహసీల్దార్ గియాసున్నీసాబేగం, ఏఓ హరిప్రసాద్, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఆర్ఐ నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్య

డీఈఓ రాధాకిషన్



కౌడిపల్లి: రికార్డులను తనిఖీ చేస్తున్న రాధాకిషన్

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. అలాగే నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. గురువారం ఆయన మండలంలోని రాజిపేట ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యా బోధనను పరిశీలించారు. ఆపై మధ్యాహ్న భోజనం తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేందర్, ఉపాధ్యాయులు నవాజ్, సుజాత, నాగారాజు తదితరులు పాల్గొన్నారు.

మరో ఉపాధ్యాయుడిని నియమించండి: సర్పంచ్

పాఠశాలకు మరో ఉపాధ్యాయుడిని నియమించాలని సర్పంచ్ లింగంగౌడ్, ఉపసర్పంచ్ మాధవి శివ, మాజీ సర్పంచ్ పాషా, పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం తదితరులు డీఈఓను కలిసి కోరారు. 109 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని వివరించారు. ప్రభుత్వం ఇద్దరు టీచర్లను డిప్యూటేషన్‌పై మంజూరు చేసిందన్నారు. ఒక్కరు మాత్రమే ఇక్కడికి వచ్చారని తెలిపారు. మరొకరిని వెంటనే నియమించాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని డీఈఓ హామీ ఇచ్చారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మెదక్‌లోని బాలికల ఉన్నత పాఠశాలల ఎస్టీయూటీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్‌లో జిల్లాను ఉత్తమ స్థానంలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజగోపాల్ గౌడ్, పోచయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎర్రరాజు, కిష్టయ్య, భూపతి గౌడ్, రేఖ, లక్ష్మి ప్రసన్న , అశోక్, అరుణ్ కుమార్, దుర్గరాముల, ఎల్లం, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇగ్నైట్ ఫెస్ట్ విజయవంతం

హాజరైన 900 మంది విద్యార్థినీ విద్యార్థులు



ఫెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులతో కోఆర్డినేటర్, ఆయా కాలేజీల ప్రిన్సిపాల్స్

నర్సాపూర్: ఇగ్నైట్ ఫెస్ట్‌లో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారని గిరిజన గురుకుల రీజనల్ కోఆర్డినేటర్ సంపత్‌కుమార్ తెలిపారు. స్థానిక గిరిజన గురుకుల, పాఠశాల కాలేజీలో రెండురోజుల పాటు జరిగిన ఇగ్నైట్ ఫెస్ట్ గురువారంతో ముగిసింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజన గురుకులం సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. ఇందులో మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి సుమారు 900 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. వారి కోసం 22 రకాల ఈవెంట్స్ ఏర్పాటు చేశారన్నారు. అన్ని ఈవెంట్స్‌లో విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారని వివరించారు. మూడు జిల్లాల్లోని ఆయా కాలేజీలు, పాఠశాలల ప్రిన్సిపాల్స్ సహకారంతో ఫెస్ట్ విజయవంతమైందన్నారు. ఈవెంట్స్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ భిక్షమయ్య, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రజాపాలనలో ఫ్లెక్సీల గొడవ

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగిన బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్న ప్రజాపాలన గ్రామసభలో ఫ్లెక్సీల గొడవ జరిగింది. ప్రధాని, ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని ఎందుకు పెట్టనివ్వరని తహసీల్దార్‌తో బీజేపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. గంటసేపు గందరగోళం నెలకొంది. విషయానికొస్తే.. ఇతర శాఖల అధికారులతో కలిసి తహసీల్దార్ ఆంజనేయులు వెల్మకన్న గ్రామసభకు వచ్చారు. ఇదే సభలో సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు రాకేష్, అశోక్, రాజు, తదితరులు ఆరు గ్యారంటీల ఫ్లెక్సీలో ప్రధాని మోదీ, ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫొటో లున్న ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలన్నారు. దీనికి తహసీల్దార్ గ్రామసభ వద్ద అనుమతి లేదని జవాబు చెప్పారు. ఆ ఫొటోలున్న ఫ్లెక్సీ ఎందుకు పెట్టకూడదని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. గ్రామసభ వద్ద కాకుండా పక్కన దానిని కడతామని చెప్పినా అధికారులు అనుమతిలేదంటూ ఒప్పుకోలేదు. దీంతో బీజేపీ నాయకులు తయారు చేసిన ఫ్లెక్సీని అధికారులు ఇవ్వ లేదు. కాగా అధికారులు తీసుకువచ్చిన ఫ్లెక్సీని బీజేపీ నాయకులు తీసుకువెళ్లారు. దీంతో తహసీల్దార్, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితి ఉద్రిక్తతగా మారడంతో నర్సాపూర్ సీఐ షేక్ లాల్‌మధర్, చిలప్‌చెడ్ ఎస్ఐ మహబూబ్, ఏఎస్ఐలు విఠల్, శ్రీనివాస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఆ పార్టీ నాయకులకు నచ్చజెప్పారు. గ్రామసభలో కాకుండా టెంట్ వద్ద వారు దానిని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రజాపాలన గ్రామసభను నిర్వహించారు. ఇదిలాఉండగా గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 444, 474లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జాలు చేస్తున్నా.. తహసీల్దార్ పట్టించుకోవడం లేదని నేతలు ఆరోపించారు. కాగా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వివరించారు.

అందరూ మెచ్చేలా అభివృద్ధి

- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్
- ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



బూరుగుపల్లి జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

హవేళిఘణాపూర్: ప్రభుత్వం ప్రజా అవసరాలను గుర్తించి వాటిని తీర్చేందుకే ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. గురువారం మండల పరిధిలోని బూర్గుపల్లి, గాజిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ మాటలు తప్ప చేసిందేమీ లేదన్నారు. మెదక్ ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. తాను మాటలు చెప్పే వ్యక్తిని కాదన్నారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సహకరించాలని కోరారు. తొలుత బూరుగుపల్లి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల సమస్యలను ఉపాధ్యాయులు.. ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన, వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే బూర్గుపల్లిలో శ్రీపతి చెరువు నీరు.. గ్రామంలో నుంచి వెళ్తుండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు.

100 శాతం పూర్తి చేస్తాం : కలెక్టర్

జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేస్తామని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రభుత్వం లక్ష్యం సాధించే దిశగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఇప్పటికే జిల్లాలో 70 శాతం పూర్తయిందని వివరించారు. ఈనెల 6వ తేదీ వరకు తమ సిబ్బంది పంచాయతీల్లో అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్, నియోజకవర్గ నోడల్ అధికారి జయరాజ్, సర్పంచ్ చెన్నా గౌడ్, ఎంపీటీసీ అర్చన, భాగ్యలక్ష్మి, పాపన్నపేట ఎంపీపీ ప్రశాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీను, శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): వికాస్‌ గ్రామర్‌ స్కూల్‌ విద్యార్థినీ విద్యార్థులకు గురువారం చేర్యాల పోలీసుల ఆధ్వర్యంలో మహిళల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు మహిళల రక్షణ చట్టం, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ తదితర అంశాల్లో ఉమెన్‌ షీ టీమ్‌ ప్రాముఖ్యతను వివరించారు. దీంతోపాటు ఈవ్‌ టీజింగ్‌, ర్యాగింగ్‌, గుడ్‌ టచ్‌, బ్యాడ్‌ టచ్‌ వంటి అంశాలపై ఎస్‌ఐ రామ్మోహన్‌ అవగాహన కల్పించారు. ఎవరైనా మహిళలను ఉద్దేశపూర్వకంగా వెంబడిస్తే వెంటనే డయల్‌ 100, షీ టీమ్‌ వాట్సాప్‌ నంబర్‌ 87126 67343, స్నేహిత మహిళా సపోర్ట్‌ సెంటర్‌ 94946 39498, మహిళా పోలీస్‌ స్టేషన్‌ 87126 67435 కి ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్‌ హెచ్‌ఎం ఎలియాస్‌, ఉపాధ్యాయులు, హెడ్‌ కానిస్టేబుల్‌ సదయ్య, కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన సామగ్రి

నిజాంపేట(మెదక్‌): షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కల్వకుంట గ్రామానికి చెందిన పందిరి రుక్మయ్య కుటుంబంతో కలిసి ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్‌ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఫ్రిజ్‌, టీవీ, దుస్తులు, విలువైన వస్తువులు కాలిపోయాయి. ఇరుగుపొరుగు వారి సమాచారంతో కుటుంబ సభ్యులు వచ్చి చూశారు. ఫైర్‌ సిబ్బంది మంటలను ఆర్పివేయగా అప్పటికే తీవ్రనష్టం వాటిల్లింది. మండల ఆర్‌ఐ గంగాధర్‌ ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

పెయింటింగ్‌ వేస్తుండగా గుండెపోటు

- వలస కార్మికుడి మృతి


రఘువీర్‌(ఫైల్‌)

అక్కన్నపేట(హుస్నాబాద్‌): గుండెపోటుతో కార్మికుడు మృతి చెందిన ఘటన హుస్నాబాద్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీ రాష్ట్రంలోని లక్ష్మీపూర్‌కు చెందిన రఘువీర్‌ (23) ఆరేళ్లుగా హుస్నాబాద్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ వివిధ పట్టణాల్లో పెయింగ్‌ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం హుస్నాబాద్‌లోని హనుమాన్‌నగర్‌లో ఓ ఇంటిపై రంగులు వేస్తున్న క్రమంలో మధ్యాహ్నం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే పని చేస్తున్న పలువురు కార్మికులు హుటాహుటినా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. మృతుడికి భార్య, తొమ్మిది నెలల కుమారుడు ఉన్నారు.





దారి చూడు.. దుమ్ము చూడు

సిద్దిపేట నుంచి ఎల్కతుర్తి హైవే పనుల్లో నిండా నిర్లక్ష్యం కనిపిస్తుంది. కాంట్రాక్టర్‌ పనుల్లో అలసత్వం వహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం పోసిన కంకర, మట్టిపై నీళ్ల చల్లకపోవడంతో దుమ్మూధూళి లేస్తుంది. నిత్యం వెళ్లే హైవే కావడంతో వాహనదారులు, సమీప గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నారు. హుస్నాబాద్‌కు ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

– స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌, సిద్దిపేట

తీపి తగ్గలేదు

- చెరకు పంటపై జహీరాబాద్‌ రైతుల ఆసక్తి
- కష్టనష్టాలు ఉన్నా సాగు
- కొనసాగుతున్న ప్లాంటేషన్‌
- కొత్తగా 10 వేల ఎకరాల్లో పంట


జహీరాబాద్‌ ప్రాంతంలో సాగవుతున్న చెరకు పంట

జహీరాబాద్‌ టౌన్‌: ప్రతికూల పరిస్థితులు ఉన్నా జహీరాబాద్‌ ప్రాంత రైతులు చెరకు పంట సాగుపైనే ఆసక్తి చూపుతున్నారు. కష్టనష్టాలు ఉన్న గత్యంతరం లేక చెరకు పంట సాగుకే మొగ్గు చూపుతున్నారు. విత్తనం నాటి నుంచి కర్మాగారానికి సరఫరా చేసే వరకు రైతులకు తిప్పలు తప్పడం లేదు. దిగుబడి రాక.. గిట్టుబాటు ధర లేక.. పెట్టుబడులు రాని పరిస్థితులు ఉన్నాయి. రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంటను కర్మాగారానికి సరఫరా చేసినా బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలి యని పరిస్థితి. భారీ నష్టాలు రావన్న భరోసాతో రైతులు చెరకు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

జహీరాబాద్‌ ప్రాంత నేలలు చెరకు, అల్లం, ఆలుతోపాటు కంది, సోయాబీన్‌, పత్తి, పెసర, మొక్కజొన్న, శనగ పంటలకు అనుకూలం, శాశ్వత నీటి వనరులు లేక బోరు బావులపై ఆధారపడి చెరకు సాగు చేస్తున్నారు. మిగతా పంటలతో చూస్తే పెద్దగా నష్టం రాదని ఎక్కువ మంది రైతులు చెరకు పంట సాగుపై ఆసక్తి చూపుతుంటారు. ఎకరం పొలం కలిగిన రైతు కూడా చెరకు సాగు చేస్తుంటారు. జహీరాబాద్‌ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం సుమారు 3 లక్షల టన్నుల వరకు చెరకు పంట సాగవుతుంది. సాధారణంగా ఎకరానికి 40 టన్నుల వరకు దిగుబడి రావాలి కానీ ప్రస్తుతం 25 టన్నులు దాటడం లేదు.

10 వేల ఎకరాల్లో కొత్తగా ప్లాంటేషన్‌

రెండేళ్ల నుంచి రైతులు గడ్డుకాలం ఎదుర్కొంటున్నారు. పట్టణ సమీపంలోని ట్రైడెంట్‌ కర్మాగారం ఉండగా గతేడాది సరఫరా చేసిన చెరకు పంటకు రూ.9 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ సంవత్సరం క్రషింగ్‌ జరపడం లేదు. గత్యంతరం లేక రైతులు తక్కువ ధరకు బ్రోకర్లకు పంటను అమ్ముకుంటున్నారు. ఇన్ని ప్రతికూల పరిస్థితులు ఉన్నా రైతులు చెరకు పంట సాగుపై ఆసక్తి చూపుతూనే ఉన్నారు. నవంబర్‌ నెల నుంచి చెరకు విత్తే పనులు కొనసాగుతున్నాయి. పొలాల్లో పంట ఉండగానే కొత్తగా ప్లాంటేషన్‌ చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 10 వేల ఎకరాల్లో కొత్తగా ప్లాంటేషన్‌ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. రాయికోడ్‌ మండలంలో కొత్తగా చెక్కర కర్మాగారం ఏర్పాటవుతోంది. యాజమాన్యం ఇప్పటి నుంచి అగ్రిమెంట్‌ చేసుకుంటున్నారు. దీంతో రాయికోడ్‌, ఝరాసంగం మండలాల్లో పంట విస్తీర్ణం పెరుగుతుంది.

> **చెరకు పంటే ఆదుకుంటుంది**
>
> 
>
> వర్షాలు పడ్డా.. పడకపోయినా.. గిట్టుబాటు ధర ఉన్న లేకపోయినా ఈ ప్రాంత రైతులు తప్పకుండా చెరకు పంటను సాగు చేస్తారు. తమను చెరకు పంటే ఆదుకుంటుంది. ఇతర పంటలు పండిస్తే పెట్టుబడులు కూడా రావు, అదే చెరకు పంటలో లాభం రాకున్న పెద్దగా నష్టం ఉండదు.
>
> – శంకర్‌, రైతు, జహీరాబాద్‌

ఆర్టీసీ ఉద్యోగుల వనభోజన మహోత్సవం


వనభోజనంలో ఆర్టీసీ ఉద్యోగులు

హుస్నాబాద్‌: టీఎస్‌ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ ఆదేశాల మేరకు పట్టణంలోని డిపోలో మేనేజర్‌ సీహెచ్‌. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీఎస్‌ ఆర్టీసీ ఉద్యోగులు వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్‌ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు ఎప్పుడూ వారి విధి నిర్వహణలో భాగంగా తీరిక లేకుండా కష్టపడుతున్నారన్నారు. కొంత ఉపశమనం కలిగించాలనే ఆలోచనలతో రెండు విడతలుగా వనభోజనాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో భాగంగా డిపోలో ఉద్యోగులు అందరూ ఆటపాటలతో చాలా సరదాగా గడిపారన్నారు. నవంబరు, డిసెంబర్‌ నెలల్లో మంచి ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ శ్రీధర్‌, ట్రాఫిక్‌ సూపరింటెండెంట్‌ నర్సయ్య, శామ్యూల్‌, అకౌంట్స్‌ లక్ష్మారెడ్డి, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రైసుమిల్లు వ్యాపారి ఆస్తులు సీజ్‌

- ప్రభుత్వానికి రూ.47 కోట్ల బకాయిలు

నర్సాపూర్‌ : నర్సాపూర్‌కు చెందిన రైసుమిల్లు వ్యాపారి శ్రీధర్‌గుప్తాకు చెందిన పలు ఆస్తులను గురువారం రెవెన్యూ అధికారులు సీజ్‌ చేశారు. శ్రీధర్‌ గుప్తా ప్రభుత్వం నుంచి వడ్లను తీసుకొని మరాడించి బియ్యం (సీఎంఆర్‌) ప్రభుత్వానికి చెల్లించినందున అతడి ఆస్తులు సీజ్‌ చేసినట్లు తహసీల్దార్‌ కమలాద్రి పేర్కొన్నారు. శ్రీధర్‌ గుప్తా ప్రభుత్వానికి రూ.47.17 కోట్లు బాకీ పడ్డారని తెలిపారు. అతడికి చెందిన రెండు కార్లు, రెండు ఏసీ మిషన్లు, ఒక టీవీని సీజ్‌ చేసి, వాటిని పోలీసులకు అప్పగించామన్నారు. పలుమార్లు నోటీసులు ఇచ్చినా వ్యాపారి స్పందించకపోవడంతో ఆస్తులు సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్‌ వెంట ఆర్‌ఐలు ఫైజల్‌, సిద్ధిరాంరెడ్డి తదితరులు ఉన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలేవి?

- మిట్టపల్లిలో నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం
- అనుమతులు లేకుండానే పనులు
- పట్టించుకోని అధికారులు


నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల భవనం

సిద్దిపేటఅర్బన్‌: మండలంలోని మిట్టపల్లి గ్రామ పరిధిలో అక్రమ కట్టడాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిట్టపల్లి గ్రామంలో హన్మకొండ, వరంగల్‌ రహదారి పక్కనే ఎలాంటి అనుమతులు లేకుండా వెయ్యి గజాలకు పైగా స్థలంలో నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. అక్రమ కట్టడానికి సంబంధించి వివరాలు గ్రామ పంచాయతీ వద్ద లేవని ఆరోపిస్తూ గ్రామ ప్రజాప్రతినిధి ఒకరు రెండు రోజుల క్రితం సోషల్‌ మీడియాలో వీడియో పోస్ట్‌ చేశారు. గ్రామానికి చెందిన మండల ప్రజాప్రతినిధి భవనం కావడంతోనే అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పేద ప్రజలు చిన్న రూమ్‌ కట్టుకోవడానికి అనుమతి తీసుకోవాలని చెప్పే అధికారులు నాలుగు అంతస్తుల భవనం ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్నా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సుడా పరిధిలోకి వెళ్లింది

గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా సుడా ఏర్పాటు అయినప్పటి నుంచి ఇంటి నిర్మాణ అనుమతులు దాని పరిధిలోకి వెళ్లాయని, తమకు అనుమతులు ఇచ్చే అధికారం లేకుండా పోయిందని తెలిపారు. నాలుగు అంతస్తుల భవనం వెయ్యి గజాలకు పైగా స్థలంలో నిర్మిస్తుండడం వల్ల టీఎస్‌ బీపాస్‌ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అది ఇప్పుడు సుడా పరిధిలో ఉందని తెలిపారు. అక్రమ నిర్మాణంకు సంబంధించి ఆరోపణలు వచ్చిన వెంటనే అనుమతులు వచ్చే వరకు నిర్మాణ పనులను ఆపి వేయాలని సూచించి పనులను ఆపి వేయించామన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారులతో సూర్యప్రకాశ్‌, తదితరులు

జిల్లా ఇంటర్‌ విద్యాధికారి సూర్యప్రకాష్‌

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా ఇంటర్‌ విద్యాధికారి సూర్యప్రకాష్‌ అన్నారు. అండర్‌–19 ఎస్‌జీఎఫ్‌ సాఫ్ట్‌ బాల్‌ ఉమ్మడి మెదక్‌ జిల్లా జట్టు ఎంపిక పోటీలను గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన క్రీడాకారులు మెలకువలను నేర్చుకొని భవిష్యత్‌లో రాణించాలని సూచించారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 16 మంది బాలురు, 16 మంది బాలికలను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. అండర్‌ –19 ఎస్‌జీఎఫ్‌ కార్యదర్శి సమ్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ రెడ్డి, టీజీఎల్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం, రాష్ట్ర అధికార ప్రతినిధి నంట శ్రీనివాస్‌ రెడ్డి, క్రీడల ఇన్‌చార్జి వెంకటేష్‌తోపాటు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెళ్లింట తీవ్ర విషాదం

- సరదా కోసం చెరువులో బోటు ఎక్కిన యువకుడు
- ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి
- తూప్రాన్‌ మండలం రావెల్లి గ్రామంలో విషాదకర ఘటన


లక్ష్మణ్‌ మృతదేహం

తూప్రాన్‌: మరో రెండు రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదం నెలకొంది. పెళ్లి కుమార్తె అన్న సరదా కోసం పట్టణంలోని పెద్ద చెరువులో బోటు ఎక్కేందుకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ పరిధిలోని రావెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రావెల్లి గ్రామానికి చెందిన తంగిళ్ల (చాకలి) భిక్షపతి కూతురు వివాహం ఈ నెల 7న ఆదివారం జరగాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పెళ్లి పనుల్లో నిమగ్నం అయ్యారు. భిక్షపతి కుమారుడు లక్ష్మణ్‌ (23) తన ముగ్గురు స్నేహితులతో కలిసి పట్టణ పరిధిలోని తాతపాపన్‌పల్లి గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో పెద్ద చెరువు కట్టపై నుంచి వస్తున్నారు. బతుకమ్మ ఘాటు వద్ద చెరువులో నిలిపి ఉన్న బోటులో ఎక్కేందుకు లక్ష్మణ్‌ వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి గల్లంతయ్యాడు. స్నేహితులు వెంటనే విషయాన్ని గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో సుమారు నాలుగు గంటలపాటు వెతికి లక్ష్మణ్‌ మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. చేతికంది వచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


పరుశరాములు

గజ్వేల్‌రూరల్‌: ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గిరిపల్లి శివారు కాళేశ్వరం కాల్వ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్‌ మండలం రాంసాగర్‌ గ్రామానికి చెందిన పరుశరాములు టైలర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పరుశరాములు బైక్‌పై బుధవారం గజ్వేల్‌కు వచ్చాడు. పని ముగించుకొని రాత్రి సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా గిరిపల్లి శివారు కాళేశ్వరం కాల్వ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పరుశరాములు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మాక్స్‌ సొసైటీ కాలనీలో విషాదం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్‌ డివిజన్‌ పరిధిలోని మాక్స్‌ సొసైటీ కాలనీకి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మంగళవారం తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. చనిపోయిన వారి మృతదేహాలు బుధవారం అర్ధరాత్రి మ్యాక్‌ సొసైటీ కాలనీకు చేరుకోగా గురువారం అంతక్రియలు నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకులు గూడెం మధుసూదన్‌ రెడ్డి ప్రమాదంలో గాయపడిన సుభాష్‌ గౌడ్‌ను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి రూ.25 వేలు, నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌ గౌడ్‌ రూ.25 వేలు, మాక్స్‌ సొసైటీ కాలనీ ఫ్రంట్‌ లైన్‌ సభ్యులు రూ.96 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఆధార్‌ అనుసంధానం రద్దు చేయాలి


కూలీలతో మాట్లాడుతున్న శంకర్‌

డీబీఎఫ్‌ జాతీయ కార్యదర్శి శంకర్‌

మర్కూక్‌ (గజ్వేల్‌): ఆధార్‌ అనుసంధానం ఉపాధి హామీ కూలీలకు శాపంగా మారిందని వెంటనే ఉపసంహరించుకోవాలని దళిత బహుజన ఫ్రంట్‌ జాతీయ కార్యదర్శి శంకర్‌ డిమాండ్‌ చేశారు. గురువారం మండలంలోని పాతూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. పని చేస్తున్న పద్ధతి, ఆలస్యపు వేతనాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని హక్కుగా అమలు చేయకుండా చట్టానికి విరుద్ధంగా కొత్త నిబంధనలు అమలులోకి తీసుకొస్తూ కూలీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా 25.89 కోట్ల మంది కూలీల్లో జాబ్‌కార్డుతో బ్యాంక్‌ ఖాతాలకు అనుసంధానమైన వారు 13.48 కోట్ల మంది మాత్రమే ఉన్నారన్నారు. వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఉపాధి హామీని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్‌ జిల్లా ప్రధానకార్యదర్శి బ్యాగరి వేణు, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: మద్యానికి బానిసై వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గౌతమ్‌ నగర్‌కు చెందిన జోగు శీను (46) టెంట్‌ హౌస్‌లో పని చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యా నికి బానిస అయ్యాడు. బుధవారం రాత్రి జోగు శీను పడుకున్న చోట నుంచి లేవకపోవడంతో అతడి సోదరుడు యాదయ్య చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వాంతులు చేసుకొని..


అనారోగ్యంతో వాంతులు చేసుకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్‌ రెడ్డి కథనం ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన సాజిత్‌ బీశ్వాస్‌(40) బతుకు దెరువు కోసం నెల కిందట వచ్చి ఇస్నాపూర్‌లో సోదరుడి వద్ద ఉంటూ పాశమైలారం పారిశ్రామిక వాడలో ప్రైవేట్‌ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2వ తేదీ డ్యూటీకి వెళ్లి వచ్చి రాత్రి 10 గంటల సమయంలో ఇంట్లో వాంతులు చేసుకున్నాడు. తిరిగి మరుసటి రోజు వాంతులు కావడంతో సోదరుడు చికిత్స కోసం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. మృతుడి సోదరుడు అబిత్ర అవిశ్వాసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తాగొద్దన్నందుకు.. యువకుడు ఆత్మహత్య

హవేళిఘణాపూర్‌(మెదక్‌): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్‌ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మక్తభూపతిపూర్‌ గ్రామానికి చెందిన అనిల్‌(21) మేస్త్రీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తండ్రి సత్యనారాయణ మద్యం మానివేయాలని అనిల్‌ను బెదిరించడంతో మనస్తాపానికి గురై రాత్రి అందరు నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు తలుపు పగులగొట్టి చూసేలోపే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్‌ రూరల్‌ పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలు తాళలేక..

ఆటోడ్రైవర్‌ ఆత్మహత్య


యూసుఫ్‌ (ఫైల్‌)

సిద్దిపేటకమాన్‌: అనారోగ్య సమస్యలతో తీవ్ర మనోవేదనకు గురై ఆటోడ్రైవర్‌ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట కేసీఆర్‌నగర్‌లో గురువారం చోటు చేసుకుంది. సిద్దిపేట టూటౌన్‌ సీఐ రవికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన షేక్‌ యూసుఫ్‌ (40) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు కాలికి గాయం అయింది. షుగర్‌ ఉండడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నా గాయం మానలేదు. దీంతో తీవ్ర మనోవేదనకు గురై గురువారం మధ్యాహ్నం భోజనం తినడానికి ఇంటికి వచ్చి ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో కుటుంబ సభ్యులు సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.